నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | KARIMNAGAR



> అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఎన్నో హామీలిచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ మాటపైనా నిలబడలేకపోతున్నది. మొన్న రుణమాఫీ విషయంలో వేలాది మంది రైతులకు మొండిచేయి చూపిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా వానకాలం సీజన్ రైతు భరోసాపై చేతులెత్తేసింది. పంట పండించే రైతులకే రైతు భరోసా ఇస్తామని, అందుకు అవసరమైన ఒక సబ్ కమిటీని వేస్తున్నామని, నివేదికలు ఇచ్చిన తర్వాతనే రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడంపై రైతులోకం మండిపడుతున్నది. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించక పోవడంపైనా ఆగ్రహిస్తున్నది. ఈ పరిస్థితిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గులాబీ శ్రేణులతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమైంది.

## మూసీపై ఉన్న ప్రేమ.. రైతులపై లేదా?

### మాజీ ఎమ్మెల్యే రసమయి ధ్వజం

తిమ్మాపూర్, అక్టోబర్19 : 'సీఎం రేవంత్‌రెడ్డికి మూసీ సుందరీకరణపై ఉన్న ప్రేమ.. రైతులపై లేదా?' అని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. రైతుబంధు ఇవ్వకున్నా అప్పులు చేసి రైతులు పంటలు పండించారని, కనీసం కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరైనా అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ శివారులో వ్యాపారులు ఏర్పాటు చేసిన కాంటా వద్ద ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడ్డ రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుబంధు ఇవ్వకున్నా అప్పులు చేసి పంటలు పండించారని, కనీసం సమయానికి కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరైనా అందేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను వస్తే తప్ప ఎక్కడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించవద్దని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సొసైటీ చైర్మన్లు, అధికారులకు ఆదేశాలిచ్చారని, ఆయన అన్ని గ్రామాలు తిరుగుతూ ప్రారంభించే సరికి సీజన్ పూర్తవుతుందని ఎద్దేవా చేశారు.


తిమ్మాపూర్ శివారులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



# రైతు భరోసా కోసం..

## నేడు బీఆర్‌ఎస్ ఆందోళన

- మరోసారి రైతుల పక్షాన రణం
- ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం
- అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు
- పార్టీ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

**రైతుల పక్షాన రణం చేసేందుకు మరోసారి బీఆర్‌ఎస్ దళం సిద్ధమైంది. వానకాలం సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టిన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఆందోళన బాట పడుతున్నది. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునివ్వగా, నేడు ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేపట్టనున్నారు.**

### రైతుల పక్షాన పోరాడుతాం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతును మోసం చేస్తున్నది. వారికి ఇచ్చిన ఏ ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదు. కమిటీలు వేసి కాలయాపన చేసే ప్రయత్నం చేస్తున్నది. మా ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతు బంధు రైతులకు ఎంతో ఉపయోగపడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లో యాసంగికి రైతుబంధు పథకాన్నే మొక్కుబడిగా అమలు చేశారు. వానకాలం పంటకు ఇవ్వనే లేదు. వ్యవసాయ శాఖ మంత్రి సిగ్గు లేకుండా కమిటీ నివేదిక తర్వాతనే రైతు భరోసా ఇస్తామని చెప్పడం శోచనీయం. వెంటనే రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో మా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నాం. ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

**- జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు (కరీంనగర్)**

కరీంనగర్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు కింద ప్రతి సీజన్‌కు ఎకరాకు ₹5 వేల చొప్పున ఏటా ₹10 వేలు పెట్టుబడి సాయం అందించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ అనేక సందర్భాల్లో రైతుబంధును మాత్రం తప్పకుండా సీజన్ ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో జమ చేసేది. ఈ మొత్తంతోనే రైతులు పెట్టుబడుల కోసం ఎక్కడ చేయిచాపకుండా సాగుబాట పట్టేవారు. నిరందీగా ఎవుసం చేసుకునే వారు. కానీ, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ప్రతి సీజన్‌కు ₹7,500 చొప్పున ఏటా ₹15 వేలు అందిస్తామని చెప్పి వారి ఓట్లు వేయించుకుంది. అధికారంలోకి వచ్చిన మొదట్లో యాసంగి సీజన్‌కు బలవంతంగా రైతుబంధునే యాధావిధిగా అమలు చేసింది. రైతు భరోసా కింద ₹7,500 ఇస్తారేమోనని ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిల్చింది. అప్పుడు వానకాలం నుంచి రైతు భరోసా అమలు చేస్తామని నమ్మబలికింది. తీరా వానకాలం సీజన్ దాటి పోయినా ఇప్పటి వరకు దానిని అమలు చేయలేదు. ఇప్పుడు ఏకంగా చేతులెత్తేసింది. 'పంట పండించే రైతులకే రైతు భరోసా ఇస్తామని, అందుకు అవసరమైన ఒక సబ్ కమిటీని వేస్తున్నామని, కమిటీ నివేదికలు ఇచ్చిన తర్వాతనే రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడంతో చెప్పడంతో రైతాంగం నిరాశకు లోనయింది. రైతు భరోసాను ఇవ్వకుండా మభ్యపెడుతున్నదని, తమను అన్ని రకాలుగా మోసం చేస్తున్నదని వాపోతున్నది. ఇటు ఆది నుంచీ రైతులకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్, సర్కారు తీరుపై తీవ్రంగా మండిపడుతున్నది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని, కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తుతున్నది. పంట రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించగా, ఇంకా చేయాల్సి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పడం రైతులను మోసగించే పనుల్లో భాగమేనని మండిపడుతున్నది. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా వెంటనే అమలు చేయాలని, పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ చేయాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు శనివారం సాయంత్రం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, ఆదివారం నిరసనలకు పిలుపునిచ్చారు. దీంతో అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. నేటి నిరసనలను విజయవంతం చేయాలని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల పార్టీ అధ్యక్షులు జీవీఆర్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, తోట ఆగయ్య వేర్వేరుగా పిలుపునిచ్చారు.



# ఈ చేప పిల్లలు మాకొద్దు

- నాసిరకం విత్తనాలు మాకెందుకు..?
- కాలందాటిపోయిన తర్వాత ఏం చేసుకోమంటరు
- పెద్దపల్లి జిల్లాలో మత్స్యకారుల ఆందోళన
- నిన్న అంతర్గాం, పాలకుర్తిలో, నేడు మంథనిలో వాపస్

మంథనిలో పంపిణీకి వచ్చిన చిన్న సైజ్ చేప పిల్లలు


చిన్న సైజ్ చేప పిల్లలు పంపిణీ చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు

పెద్దపల్లి, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): 'ఇంత చిన్న చేప పిల్లలు దేనికి? కప్పలు, పాములకు ఆహారం కోసం ఇస్తున్నరా..? ఆగస్టులో పంపిణీ చేయాల్సింది కాలందాటిపోయిన తర్వాత ఇప్పుడు ఇస్తారా..? నాసిరకం విత్తనాలు అసలు ఈ చెరువులో బతుకుతయా..? కాంట్రాక్టర్లకు కాసులు కురిపించడానికి తప్ప మా కోసం కాదు. ఈ పిల్లలు మాకు అక్కర్లేదు' అంటూ పెద్దపల్లి జిల్లాలోని మత్స్యకారులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుకోచోట చెరువుల వద్దకు వచ్చిన చేప పిల్లల వ్యాన్లను వెనక్కి పంపించేస్తున్నారు. ఇక నుంచీ చేప విత్తనాలకు బదులు మాకు నగదు జమ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 7న మంథని పట్టణంలోని తమ్మి చెరువులో రాష్ట్ర ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అప్పుడు మాత్రమే నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. కానీ, ఆ తర్వాత ఆయా చెరువుల్లో వేసేందుకు అధికారులు తెచ్చిన చేప పిల్లలు మాత్రం చాలా చిన్నగా నాసిరకంగా ఉంటుండడంతో మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. రెండ్రోజుల కింద అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాల్లో పంపిణీ చేసేందుకు తెచ్చిన చేప పిల్లలు మరీ చిన్నగా ఉండడంతో తిరస్కరించారు. దాంతో అధికారులు పంపిణీ చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. శనివారం మంథని ప్రాంత చెరువుల్లో విడుదల చేసేందుకు తెచ్చిన దాదాపు రెండు లక్షల చేప పిల్లలు కూడా నాసిరకంగా ఉండడంతో వద్దని వెనక్కి పంపారు. కాంట్రాక్టర్లు, మత్స్యశాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడ్ నాణ్యత, ఆరోగ్య పరిస్థితిని మత్స్యశాఖ అధికారులు పరీక్షించి 80 నుంచి 100మిల్లీ మీటర్ల చేప పిల్లలు ఏడాదంతా నీరుండే పెద్ద చెరువుల్లో, సీజనల్ ట్యాంకు(చిన్న చెరువు)ల్లో 35–40మిల్లీ మీటర్ల సైజు పిల్లలను పోయాల్సి ఉంటుంది. కానీ, పూర్తిగా చిన్న పిల్లలు, నాసిరకమైనవి పంపిణీ చేస్తుండడంతో మత్స్యకారులు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు.

### ఈ చేప పిల్లలు వద్దు

ఇప్పుడు చేప పిల్లలు పోసే టైమే కాదు. మేం మొదటి నుంచి చెబుతున్నం. అన్ని చెరువుల్లో కుంటల్లో ఇప్పటికే చేప పిల్లలను పోసుకున్నం. ఇవెందుకు పోస్తున్నారో అర్థమైతలేదు. ఇప్పుడు నగదు బదిలీ చేస్తే సరిపోతుంది. అప్పుడు మాకు నచ్చిన నాణ్యమైన చేప పిల్లలను కొని తెచ్చుకుంటం. ఇలా కాంట్రాక్టర్లకు ఇవ్వడం వల్ల వాళ్లు బతకడమే కానీ మాకు ఏ మాత్రం ప్రయోజనం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ నాణ్యత లేని చేప పిల్లలను పోయనియ్యం. 35 నుంచి 40మిల్లీ మీటర్ల పొడువుండే చేప పిల్లలే మాకు కావాలి.

**- కొలిపాక నర్సయ్య, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు (పెద్దపల్లి)**

### నాణ్యత లేని చేపలెందుకు?

ఈ చేపలు చెరువుల్లో పోస్తే దేనికీ అక్కరకు రావు. మేం జూన్, జూలైలో పోసుకున్న చేపలే ఇప్పుడు దాదాపుగా 300 నుంచి 400 గ్రాముల వరకు పెరిగి ఉంటయి. ఇప్పుడు వేసే చేప పిల్లలు వాటికి ఆహారమవుతయి. మా మంథని ప్రాంతంలో 13సొసైటీలు ఉన్నయి. ఏ ఒక్క సొసైటీలో ఈ చేప పిల్లలను పోసుకోం. మాకు అక్కర లేదు. దాదాపు 2లక్షల చేప పిల్లలను వెనక్కి పంపుతున్నం.

**- పోతరవేణి క్రాంతి, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు (మంథని)**



వంటవార్పులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

# పంటలకు ఎల్లంపల్లి నీళ్లివ్వండి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- రైతు సమస్యలపై జనగామలో బీఆర్‌ఎస్ వంటావార్పు

జ్యోతినగర్, అక్టోబర్ 19: కాంగ్రెస్ సర్కారు రైతులను గోసపెడుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఎత్తి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్ పరిధిలోని జనగామ గ్రామ రైతుల పంట పొలాలు సాగునీరు లేక ఎండుతుండడంతో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రామ శివారులోని గోదావరి ఒడ్డున బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై గోదావరి నదిని పరిశీలించారు. రైతులతో కలిసి వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో గోదావరి పరీవాహక ప్రాంతాల రైతులు పంపు మోటర్లు పెట్టుకుని సాగు చేశారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు గోదావరిలో నీరులేక కోతకు వచ్చే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీరు ఉందని, సుందిళ్ల, అన్నారం, కన్నెపల్లి బ్యారేజీలు నింపితే ఈ ప్రాంత రైతులు పంట సాగు చేస్తారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే బ్యారేజీల మరమ్మతుల పేరిట పంపింగ్ చేయడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలు లేదుగానీ.. ఎవరు అడిగారని మూసీ ప్రక్షాళన చేపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో అమాయక ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేసీఆర్‌ను బద్నాం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని, డైవర్షన్‌కు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతుల బాధలు తెలుసుకొని వెంటనే ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరిచి నీళ్లందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో ఏడాది పొడవునా గోదావరి నిండుకుండను తలపించేదని గుర్తు చేశారు. దీంతో పరీవాహక ప్రాంత గ్రామమైన ఒక్క జనగామలోనే దాదాపు 400 ఎకరాల్లో రైతులు పంటలు పండించారని చెప్పారు. ప్రస్తుతం గోదావరిలో నీళ్లు లేక పంటలు చివరి దశలో ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. వెంటనే ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరిచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. నిరసనలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, జనగామ కవిత, సరోజని, కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు అచ్చవేణు, తోకల రమేశ్, జనగామ బొడ్డు నర్సయ్య, నూతి తిరుపతి, సంధ్యారెడ్డి, జక్కుల తిరుపతి, చల్ల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ 'అలయ్ బలయ్'

### హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

తిమ్మాపూర్, అక్టోబర్ 19 : మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఆదివారం మానకొండూర్ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ 'అలయ్‌బలయ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నారు. ఈ వేడుకకు మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని రసమయి బాలకిషన్ ఒక ప్రకటనలో కోరారు.

# నిధులు మంజూరు చేయించండి

- మాజీ మంత్రి గంగుల కమలాకర్
- కలెక్టర్ పమేలా సత్పతికి వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కార్పొరేటర్లు

కార్పొరేషన్, అక్టోబర్ 19: 'కరీం'నగరం'లో గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి, సీఎం అస్యూరెన్స్ నిధులతో ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ల అభివృద్ధి చేపట్టాం. పనులు తుదిదశకు వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి వచ్చింది. వీటికి సంబంధించి నిధులు మంజూరు చేయించాలని' కోరుతూ మాజీ మంత్రి గంగుల కమలాకర్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో కలిసి శనివారం కలెక్టర్ పమేల సత్పతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై, పూర్తి కావస్తున్న టైంలో నూతన ప్రభుత్వం ఏర్పడిందని, దీనికి సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపట్టిన అమృత వర్షిని సాంస్కృతిక కళా భవనం నిర్మాణం చివరి దశకు చేరిందని, మిగిలిన పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలన్నారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో మూడు దశాబ్దాల క్రితం ఎస్సీ, బీసీ నిరుపేద కుటుంబాలకు సర్వే నంబర్ 272 ప్రభుత్వ భూమిలో ఇంటి పట్టాలు ఇచ్చారని, అందులో గృహ నిర్మాణాలకు అనుమతించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, జంగిలి సాగర్, నాయకులు జమీలొద్దీన్, తుల బాలయ్య, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## రవీందర్‌సింగ్ గెలుపు కోసం పాదయాత్ర



పాదయాత్రలో శాతవాహన విద్యార్థి జేఏసీ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్/ రామడుగు/ మల్యాల, అక్టోబర్ 19 : బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఎమ్మెల్సీగా గెలువాలని కోరుకుంటూ శాతవాహన విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో 200 మందికి పైగా యువకులు శనివారం కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వరాలయం నుంచి కొండగట్టు వరకు పాదయాత్ర చేశారు. ముందుగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాతవాహన స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం పాదయాత్రను బీఆర్‌ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, సర్దార్ సోహన్ సింగ్ ప్రారంభించారు. శనివారం రాత్రి కొండగట్టుకు చేరుకుని, అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ, రవీందర్‌సింగ్ గెలుపు కోసం రాష్ట్రంలోని నాలుగు యూనివర్సిటీల విద్యార్థులు పాదయాత్రలో పాల్గొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదని, రవీందర్‌సింగ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే ప్రశ్నించే గొంతుకగా నిలుస్తారని పేర్కొన్నారు. పాదయాత్రలో బీఆర్‌ఎస్ నాయకులు తవుటు మురళి, గొట్టం మహేశ్, పొన్నం అనిల్‌గౌడ్, కొత్తకొండ శ్రావణ్, రాము, జేఏసీ నాయకులు అరుణ్‌కుమార్, సత్యనారాయణ, రాము యాదవ్, మహేశ్, బండ అశోక్, అఖిల్, గడ్డమీద రాజశేఖర్, సాయినాయక్, రాకేశ్ పాల్గొన్నారు. రామడుగు మండలం వెదిరలో పాదయాత్రకు మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.